కథ

# చెమ్కీవర్క్ సారీ

డా. కొరారి వాణీ చలపతిరావు

ప్యారిస్‌లో ఫ్యాషన్లు చకచకా మారిపోతాయని అంటారుగానీ ఇప్పుడు ఇండియా కూడా ఫ్యాషన్లలో ప్యారిస్‌ను మించిపోయింది.

ఇంతకూ ఈ సంగతి ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే 'ఈమధ్య ఎక్కడ ఆడవాళ్ళు కనిపిస్తే అక్కడ తళతళలు, ధగధగలతో పరిసరాలన్నీ మెరిసిపోతున్నాయి' అని సమస్తమయిన వారికీ తెలియజెప్పటానికి. ఇప్పుడు చెమ్కీవర్క్ శారీస్ ఫ్యాషన్ నడుస్తోంది మరి!

ఏమి మెరుపులు! ఏమి కాంతులు! చూడటానికి రెండు కళ్ళు చాలటం లేదు. ఆకాశం నుంచి ఒక్కసారిగా చుక్కలన్నీ తెగి భూమిమీద పడ్డట్టూ, మబ్బుల్లో నుంచి మెరుపుతీగలు అకస్మాత్తుగా తెగి నేలమీద ఎక్కడ పడితే అక్కడ కుప్పలు తెప్పలుగా రాలినట్టూ, ఏ చీరమీద చూసినా దేవదారు చెమ్కీలు, జలతారు జరీతీగలు, కుందన్‌లతో నింపిన పూలు! 'ఓహ్! వీళ్ళు మానవకాంతలేనా లేక సరాసరి దేవలోకం నుంచి దిగివచ్చిన దేవకాంతలా' అన్నట్టు కళ్ళు మిరుమిట్లు గొలిపేలా మన ముందు సంచరిస్తున్నారు.


ఇంట్లో నుంచి కాలు బయటపెడితే కళ్ళు చెదిరిపోతున్నాయి! ఆఫీసులో అడుగుపెట్టినా అంతే!

ఇంతకు ముందు జీన్స్‌పాంటు, లోనెక్ టీషర్టులో ఆఫీసుకొచ్చి మనసూరించే మా టైపిస్ట్ ఇప్పుడు వర్క్ శారీలో వచ్చి వర్క్ చేయకుండా, నన్నూ చూడకుండా చీరను చూసుకుని మాటిమాటికీ మురిసిపోతోంది.

స్టైనో షెర్లీ లిల్లీ పువ్వులాంటి తెల్లటి చీరమీద పెద్దపెద్ద గులాబీలు, వాటి తాలూకు మొగ్గలు, ఆకులు గల పట్టెడంత డిజైన్ వున్న మెరిసే చీరలో వచ్చి 'మానవా! ఈ చీరకట్టు వల్ల నాకో ఘడియ ఆలస్యమైంది క్షమించవా?' అంటూ దేవకన్యలా ముద్దు ముద్దుగా ఏదో మాట్లాడుతోంది.

చెమ్కీ చీర మహత్యమే అది కాబోలు.

అది కట్టుకోగానే ప్రతి ఒక్కరూ తమకు తాము అప్పుడే దైవత్వం అబ్బిన సురకాంతల్లా



అదోలా బిహేవ్ చేస్తున్నారు.

ఆఖరికి మా ఆడ ప్యూను ఆదిలక్ష్మి సైతం అదేదో బిళ్ళలు బిళ్ళలుగా ఉన్న మెరిసే చీర కట్టుకొచ్చి.. ఆ ఫైలు ఇటు.. ఈ ఫైలు అటు పెట్టడంలో నా టేబుల్ నిండా, నా ఆఫీసు కాగితాల నిండా చెమ్కీ బిళ్ళలు పోసిపోయింది. అది ముట్టుకుంటే రాలిపోయే టైపు చెమ్కీ కాబోలు.

'హతోస్మి!' అనుకుంటూ ఆ తరువాత నన్ను నేను, నా కుర్చీని, టేబుల్‌ని దులుపుకోలేక చచ్చాను. నాలా ఇంకెంతమంది అలా దులుపుకున్నారో గానీ... మొత్తానికి ఆరోజు అందరి దుమ్మూ దులిపింది మా ప్యూను.

స్కూల్లో పిల్లలకి, జైల్లో ఖైదీలకు, డిఫెన్స్‌లో సైనికులకు పెట్టినట్లు ఏదయినా యూనిఫామ్ ఫిక్స్ చేస్తూ నోటీస్ పంపిద్దామా అన్నంత కోపం వచ్చింది. ఆ సాయంత్రం చిరుబురులాడుతూనే ఇంటికెళ్ళిన నాకు నా వైఫ్ జానకి ఎదురై 'ఈరోజు

మనం మా చిన్నాన్నగారి కూతురి పెళ్ళికెళ్లాలి..మర్చిపోయారా?' అంది కంచిపట్టుచీరలో అప్పటికే సిద్ధమై కనిపిస్తూ.

''అవును కదూ? మర్చేపోయాను'' అన్నాను నుదుటిపై కొట్టుకుంటూ... కంచిపట్టును కొసరి కొసరి చూస్తూ.

మా ఇంట్లో మేము ఇద్దరం కాక మా ఆవిడ బామ్మ, తాతయ్యలు కూడా ఉంటారు. వెనకటి కాలంలో రాణివాసపు స్త్రీలు పెళ్ళయి అత్తవారింటికి వెళ్తూ నగలు, నాణాలూ, సారెలు, సూడిదలతో పాటు దాసదాసీ జనాన్ని, కవిపండితులను కూడా అరణంగా తెచ్చుకునేవాళ్ళట. అలాగే మా ఆవిడ వాళ్ళ బామ్మ తాతయ్యలను అరణంగా తెచ్చుకుంది. అందరూ 'అదేంటి?' అని ఆశ్చర్యపోతే మా అత్తమామలు 'కొత్తకాపురం గనుక కాస్త తోడుంటారని' అని సమాధానం చెప్పారుగానీ అసలు విషయం అది కాదు. ఈ కొత్తల్లుడు ఎట్లాంటివాడో ఏమో..తాగి తందనాలాడే రకమో, పరాయి ఆడపిల్లల వంక కన్నెత్తి చూసే రకమో అని నామీద చెకింగ్‌కు, ఆమెకు కాపలాకు!

''మా బామ్మ తాతయ్యలు కూడా మనతో పెళ్ళికొస్తారండీ! పెళ్ళివాళ్ళు వాళ్ళకూ చుట్టాలేగా!'' అంది ముద్దులొలుకుతూ నా చిలకల కొల్కి. తప్పేదేముంది! అందరం కట్టగట్టుకుని బయల్దేరాం.

మ్యారేజ్ హాల్లో ఇట్టా అడుగుపెట్టామో లేదో మళ్ళీ అకస్మాత్తుగా మెరుపులు, తళతళలు, ఇంద్రధనుస్సుకు చెమ్కీ వర్క్ చేయించినట్టు ఎన్ని రంగుల్లో, ఎన్ని డిజైన్లో, ఎన్ని మోడల్సో అక్కడ!

ఇంద్రునిలా నాకూ వెయ్యి కళ్ళుంటే బాగుండేది అనిపించింది. మా ఆవిడ మాత్రం ఉన్నట్టుండి ఏమయిందో గానీ ముఖాన్ని మాడిపోయిన ట్యూబ్‌లైట్‌లా పెట్టేసింది.

'ఈవిడ బాధేంటి చెప్మా?' అని పరిశోధన చేస్తే తేలిన విషయం ఏంటంటే...పది వేల రూపాయల కంచిపట్టు చీర కట్టుకొచ్చినా తన చీర వాళ్ళందరి చీరల్లా మెరవటం లేదనీ, 'లేటెస్ట్ ఫ్యాషన్స్ తెలియని అజ్ఞాని తను కావటం వల్లే అందిరిలో వెలేసినట్టు పాత చింత కాయ పచ్చడిలా ఉన్నాననీ' ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ ఆమెకు అని! నిజం చెప్పాలంటే నా మనసుకు నాకూ మా ఆవిడ వాళ్ళ ముందు కిలుముపట్టిన ఇత్తడి బిందెలా వెలవెలాబోతున్నట్టు అనిపించింది.

ఏం చేస్తుంది పాపం! గడపదాటి బయట కాలు పెట్టి ఎరగని ఉత్తమ కొత్త ఇల్లాలు. టీవీలో నుంచైనా బయటి ప్రపంచాన్ని చూసే అవకాశం లేకుండా నేను ఇంకా 'మా అత్తగారు టీవీ ఇస్తారో ఇవ్వరో చూసి అప్పుడు కొందామ'ని మీనమేషాలు లెక్కిస్తూ వుండిపోతినాయె. అందుకే బయట పట్టపగ్గాలు లేకుండా జోరుగా, వేగంగా, వేలంవెర్రిగా తెగసాగిపోతున్న ఫ్యాషన్ల గురించి ఆమెకు తెలీదు. నిజానికి అందుకు నేనూ తెగఫీలయిపోయాను. కనీసం నేనయినా ఆమెకా అవేర్‌నెస్ కల్పించనందుకు.

ఫలితంగా పెళ్ళిలో ఎవరు దగ్గరకు వచ్చి పలకరించినా సిగ్గుతో ఆతపత్రంలా ముడుచుకుపోయింది జానకి.

మెళ్ళో రవ్వల నెక్లెస్, నడుముకు వడ్డాణం, చేతికి రాళ్ళ గాజులు ఇన్ని వంటిమీద ఉన్నా ఆ చెమ్కీ వర్క్ శారీ లేనందుకు..అది మెరుస్తున్నంతగా తన నగలు కూడా మెరవనందుకు తెగ ఫీలయిపోయింది.

మధ్య మధ్య నా వంక గుర్రుగా చూసింది కూడా.

ఆమె చూపులకు, ఆ అలకకు నాకు మాత్రమే తెలిసిన కారణం ఒకటుంది.

నాలుగు రోజుల క్రితమే వచ్చిన ఆమె పుట్టిన రోజుకు నేను పోచంపల్లి పట్టుచీర ఒకటి గిఫ్ట్‌గా ఇచ్చాను. అది నేను కావాలని చేసింది కూడా కాదు. నిజం చెప్పాలంటే ఆ రోజు ఆ వస్త్ర వ్యాపారి చేతిలో నేను మోసపోయాను. చెమ్కీ చీరల ఫ్యాషన్ వచ్చాక పట్టుచీరల గిరాకీ తగ్గిపోయిందన్న విషయం మర్చిపోయి, 'శిల్క్ శారీ హౌస్'లో అడుగుపెట్టాను. 'దొరికింది పిట్ట' అనుకున్నాడో ఏమో గుమ్మంలో నుంచే నాకు రాచమర్యాదలు చేస్తూ మెత్తటి కుర్చీవేసి, చల్లటి కూల్‌డ్రింక్ ఇచ్చి, పైన వున్న ఫ్యాన్ ఆన్ చేసి సిల్క్ చీరలు తెచ్చి నా ముందు పరిచాడు.

''ఆ! ఇప్పుడు లేటెస్ట్ ఫ్యాషన్ చీరలు ఏమిటయ్యా'' అనగానే ''ఇదుగో! ఇదే సార్! అమ్మగారి వంటిమీద ఇది అదిరిపోతుంది'' అంటూ ఇష్టం వచ్చినట్టు వాగి లేటెస్ట్ ఫ్యాషన్ అంటూ అది నాకు అంటగ్టాడు.

ఇచ్చినవాడికి బుద్ధిలేకపోయినా, తీసుకొచ్చిన నాకు తెలివితేటలు లేకపోయినా, కట్టుకునే ఆమెకయినా కాస్తంత టేస్ట్ ఉండక్కర్లా..మొగుడు ఏ చీర తెచ్చి చేతిలో పెడితే..ఆ చీరనే 'మహాప్రసాదమని' కళ్ళకద్దుకుని భక్తిశ్రద్ధలతో వంటికి చుట్టేసుకోవాలా..ఆడదన్నాక కాస్త రుచి,



## ఆ ముగ్గురూ...

ఒక్క పల్చని భామ త్రిష కాస్త విలక్షణమైన అందగత్తె అనే చెప్పవచ్చు కదా! తన అందం గురించి తనే డబ్బా కొట్టుకోను అంటుంది త్రిష. అయితే తనని గ్లామరస్ స్టార్‌గా అభిమానులు ఆరాధించడానికి గల కృషి కేవలం తన ఒక్క దానిదే కాదంటుంది. తనకి ఇంత అందమైన జన్మనిచ్చిన తన తల్లికి ఎంతో రుణపడి వుంటానంటుంది త్రిష. అలాగే తన మేకప్ వుమన్, కాస్ట్యూమ్ డిజైనర్ వీళ్లిద్దరూ కూడా తన గ్లామర్‌ని పెంచడంలో కీలకమైన వాళ్లంటుంది త్రిష. ఈ ముగ్గురు మహిళలూ తన కెరీర్‌కి ఎంతో ముఖ్యమైన వాళ్లంటుంది త్రిష.

అభిరుచి, ఇష్టాయిష్టాలు అంటూ లేకపోతే ఎలా? పైగా 'అంతా నీ మూలంగానే అన్నట్టు' నా వంక అలా గుర్రుగా చూస్తుందేమిటి? అయినా ఈరోజు తను ఆ చీర కట్టుకుని రాలేదు కదా... పెళ్ళినాడు మా అమ్మ పెట్టిన కంచిపట్టు చీర కట్టుకొచ్చింది. గొప్పగా..డాబుగా ఉంటుం దని!

'కంచుమోగినట్లు కనకంబు మోగునా' అన్నట్టు మాయజలతారు మెరిసినట్టు వెండి జల తారు మెరియునా? వర్క్ శారీ హొయలు. కంచి పట్టు చీరకెలా వస్తాయి? ప్రియురాలు ఆకర్షించి నట్లు ఇంటి ఇల్లాలు ఆకర్షిస్తుందా ఎక్కడయినా? అనుకున్నాను మనసులోనే.

పైకి అనేస్తే కొంపలంటుకుపోతాయని అన లేదు.

అసలే మేమిద్దరం ప్రచ్ఛన్నయుద్ధం చేస్తుంటే మధ్యలో దూరి మా ఆవిడ బామ్మ 'ఆ చీరలు ఎంత బాగున్నాయో చూడవే అమ్మాయీ. ఒక టిని మించి ఒకటి! రాణివాసపు స్త్రీలు అంతా కూడబలుక్కుని ఈ పెళ్ళికి వచ్చినట్టుగా లేదూ?' అంటూ నారదుడి వేషం కట్టేసింది. ఇంకేముంది. దాంతో మా ఆవిడ కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు నా వైపు కోపంగా చూస్తూ, ''పదండి పోదాం..నాకిక్కడ ఉండబుద్ధి కావటం లేదు. నా బతుకు ఎప్పుడూ ఇంతే..ఖర్మ! ఎక్కడికొ చ్చినా అవమానాలే!'' అంటూ నన్నూ, నాతోపాటు వాళ్ళ బామ్మనీ, తాతయ్యను కూడా ఇంటికి లాక్కొచ్చింది.

తగుదునమ్మా అంటూ ఈసారి వాళ్ళ తాతయ్య రంగప్రవేశం చేసి, ''ఊరుకోవే అమ్మడూ! ఎందుకు అంతగా బాధపడ తావ్? ఇలా జరుగుతుందని ముందుగా మనం మాత్రం అనుకున్నామా? ఏదో...అలా..మనం అనుకున్నది ఒకటి, జరిగింది ఒకటీ అయింది. ఈసారి నువ్వు ఎక్కడికెళ్ళినా వర్క్ శారీస్ కట్టు కునే వెలుదువుగానిలే' అంటూ అనవసర సానుభూతి చూపిస్తూ నానాసీన్లు క్రియేట్ చేసాడు.

వళ్ళు మండిపోయింది నాకు. మనవ రాలు ఎంత గారాబుపట్టయినా మరీ ఏదో పెద్ద ఉపద్రవం వచ్చినట్టు, ఆకాశం విరిగి మీద పడ్డట్టు ఇద్దరూ కలిసి ఆవిడను ఊర డించడం..ఆవిడ మరింత అలిగి ఏడ్చి నంత పనిచేయడం విచిత్రంగానే కాదు చిరాకుగానూ అనిపించింది నాకు. చిన్న విషయానికి రాద్ధాంతం చేస్తున్న మనవరా లికి 'నీకు ఇది తగదని' బుద్ధి చెప్పాల్సింది పోయి మరింత పుల్లలు పెట్టి మామధ్య కలహం పెంచుతారా?

ఒక్క పువ్వు మాత్రానికే అలిగి కోపగృహంలో దూరి కృష్ణుని తన్నిన సత్యభామలాగా తమ మనవ రాల్నీ తయారు చేద్దామనుకుంటున్నారా ఈ ఇద్దరు పెద్దాళ్ళూ. ఆఫ్ట్రాల్ చీర! దానికోసం ఇంత డ్రామానా? అనుకున్నాడు ఆశ్చర్యంగా. ఇంటికె ళ్ళాక కూడా చాలాసేపు ఎవరితో మాట్లాడలేదు. నేను, మరీ అలుసైపోతానని. చివరకు ఎప్పుడో చాలాసేపటికి ఆమే రాజీకొచ్చింది.

★ ★ ★

ఆ మర్నాడు నేను ఆఫీసు నుంచి ఇంటికొచ్చేస రికి మా ఆవిడ మెరూన్ కలర్ మీద మల్టీకలర్ థ్రెడ్ వర్క్, గోల్డ్‌కలర్ చెమ్కీ వున్న చీర కట్టు కుని చిరునవ్వుతో నాకు ఎదురువచ్చింది.

'ఈవిడ మా ఆవిడేనా' అని ఒక నిముషం ఆగి సందేహ నివృత్తి చేసుకుని గానీ లోపలికి అడుగుపెట్టలేదు నేను.

మరీ ఎక్స్‌ప్రెషన్‌లెస్ ఫేస్ పెడితే బాగుండ దనీ, వెంటనే పొగిడేయడం ఉచితమనీ అని పించి ''వావ్! మార్వలెస్'' అన్నాను.

''నిజంగా బాగుందా?'' అని అడిగింది జానకి నా నుంచి మరింత మెచ్చుకోలును ఆశిస్తూ.

''చాలాబాగుంది. నిన్నసలు గుర్తుపట్టలేక పోయానంటే నమ్ము. ఇప్పుడే ఆకాశం నుంచి దిగి వచ్చిన అప్సరసలా వున్నావ్..అప్పుడే కొనేసావేంటి వర్క్ శారీ'' అన్నాను.

''ఇదొక్కటేనా..ఇంకా ఐదు చీరలు తీసుకు న్నాను''

''అరడజను మొత్తం..''

''అవును''

''ఓ డజను తీసుకోకపోయావా?'' అన్నాను, నా గొంతులోని వ్యంగ్యాన్ని కనిపెట్టే స్థితిలో లేదు జానకి. అత్యుత్సాహం, అత్యానందం ఆమెను మరో ఉద్వేగస్థితిలోకి ఎప్పుడో లాక్కెళ్లాయి.

''తాతయ్య కొనిపెడుతున్నారు కదా అని మరీ అన్నీ తీసుకుంటే ఏం బాగుంటుంది'' అంది చటుక్కున.

ఉలిక్కిపడ్డాను నేను. ''ఇవన్నీ మీ తాతయ్య కొనిపెట్టారా?''


''అవును! నిన్నరాత్రి పెళ్ళికెళ్ళి వచ్చినప్పటి నుంచీ నేను అదోలా ఉంటుంటే పాపం ఆయన చూసి తట్టుకోలేకపోయారు. మీరు ఆఫీసుకెళ్ళ గానే 'పదవే అమ్మడూ బట్టలషాపుకెళ్దాం. చెమ్కీ వర్క్ చీరలు నీకు కావల్సినన్ని కొనుక్కుందువు గాని'' అంటూ తీసుకెళ్ళి దగ్గరుండి మరీ ఇవన్నీ కొనిపెట్టారు..అనగానే నేను ఆముదం తాగిన ముఖం పెట్టేసాను.

'నువ్వో యూజ్‌లెస్ ఫెలోవి' అని మా ఆవిడ డైరెక్ట్‌గా కాకపోయినా ఇన్‌డైరెక్ట్‌గా తిట్టి నట్లు అనిపించింది.

'అలిగిన భార్య అలక తీర్చవలసినవాడిని మొగుడ్ని అయిన నేను కదా..మధ్యలో ఈ పెద్దా యన ఏంటి పానకంలో పుడకలా' అని ముందు అనుకుని, ఖాళీ చేతులతో ఇంటికొచ్చిన నా

## కేరళ కుట్టి పార్వతి!

**ఇండో జర్మన్ భామ పార్వతి మెల్టన్ టాలీవుడ్ ద్వారానే హీరోయిన్‌గా మారింది. కానీ ఇప్పుడామెకి ఇక్కడ అంతగా అవకాశాలు రావడంలేదు. ఇదే సమ యంలో మలయాళ సినీ రంగం నుంచి అనుకోని విధంగ వచ్చిన ఆహ్వానం ఆమె కెరీర్‌ని మలుపు తిప్పిందిప్పుడు. మోహన్ లాల్ హీరోగా 'హలో' అనే సినిమా పార్వతి హీరోయిన్‌గ నటించింది. ఆ సినిమా ఇప్పుడు సూపర్ హిట్ కావడంతో అక్కడి నిర్మాతల దృష్టి పార్వతిపై పడడంతో సినిమా చాన్సులు ఆమె ఇంటి తలుపుని తడుతూనే వున్నాయిట. విదేశాల్లో పుట్టి పెరిగిన ఈ అందాల భామ ప్రస్తుతం కేరళ కుట్టిగా సినిమాలతో బిజీ బిజీ అవుతోంది.**



నిర్వాకానికి నన్ను నేనే ఆ తరువాత నిందించుకున్నాను. 'నాకు ఈ శాస్తి జరగవలసిందే' ఆవిడ తాతయ్యకున్నపాటి ఆలోచనా వేగం నాకు లేవు. నేనో 'టార్‌టాయిస్' అనుకున్నాను నన్ను నేనే విమర్శించుకుంటూ.

ఇంతలో-

రంగస్థలం మీద అనుకోకుండా మధ్యలో ఓ కొత్త పాత్ర ప్రవేశించినట్లు అక్కడే హాల్లో కూర్చుని సూదీ దారంతో ఏదో కుడుతున్న జానకి బామ్మ ''ఆ చీరల మీద కట్లలాంటి కుట్లన్నీ నాకూ వచ్చు. కాకుంటే ఇప్పుడు మగ్గం వర్క్ అనీ, ఎంబ్రాయిడరీ వర్క్ అనీ, కుందన్ వర్క్ అనీ ఏవేవో కొత్త పేర్లు పెడుతున్నారు. నేను వయసులో ఉన్నప్పుడు ఎంత చేతిపని చేసే దాన్ననీ! గుమ్మాలకు పరదాలు, టేబుళ్ళ మీద వేసుకునే బట్టలు..అన్నీ అల్లికలు, గొలుసు కుట్లు, కాడ కుట్లు, ముద్దకుట్లు కుట్టేవాళ్ళం రంగురంగుల సిలుకు దారాలతో. మ్యాట్ కుట్టని ఒకటుండేది. ఆ కుట్టుతో తులసికోటలు, దేవుడి బొమ్మలు, పూలకుండీలు కుట్టి ఫ్రేములు కట్టించి గోడలనిండా వేళ్ళాడదీసేవాళ్ళం. ఆ రోజుల్లో హార్మోనియం వాయించడం, కుట్లు అల్లికలు అల్లడం రాని ఆడపిల్లలు ఉండేవాళ్ళు కాదు. కాకుంటే ఆ రోజుల్లో ఇలాంటి చీరలూ ఉండేవి కాదు...చీరల మీద ఇలాంటి వర్కులూ ఉండేవి కావు. మెరిసే చీరలు కట్టుకుంటే అందరూ ఆక్షేపిస్తారన్న భయం కూడా ఉండేది. ఆరోజుల్లో కాస్తంత మెరుపు ఏదయినా ఉందంటే పెళ్ళినాటి బెనారస్ పట్టుచీరలమీద వెండిజరీ అంచులు, బూటాలు మాత్రమే'' అంటూ కాసేపాగి ఊపిరీ తీసుకుని మళ్ళీ మొదలుపెట్టింది బామ్మ.

''ఆ కాలంలో అందరికీ అధిక సంతానం ఉండేది కదా. మా అమ్మా, నాన్నలకు మేము ఆరుగురు ఆడపిల్లలం. మా తమ్ముడు ఎప్పుడో ఆఖర్న ఏడోవాడుగా పుట్టాడు. మా అమ్మ సాలెనర్సిమ్ములను పిలిచి మగ్గం మీద ఓ పదిహేను మూరలు నేతబట్టో, కల్నేత బట్టో నేయమనేది. దాంతోనే మా అందరికీ లంగాలు, గౌన్లు కుట్టించేది. మా నాన్న ఎప్పుడన్నా బస్తీకి వెళ్తే మాత్రం పెద్దపెద్ద పూలు, గళ్ళు, గీతలు ఉన్న కాటన్ గుడ్డలు ఓ రెండు తాన్లు వేసుకొచ్చేవాడు. వాటికే మేం బోలెడు సంబరపడిపోయి... మిషన్ అబ్బాయి దగ్గరికి పరుగులు పెట్టేవాళ్ళం. నా బట్టలు పొట్టి అయిపోతే మా చెల్లి వేసుకునేది. నేను మా అక్కయ్య బట్టలు వేసుకునేదాన్ని. ఇలా ఒకసారి తెచ్చిన బట్టలు కొన్ని సంవత్సరాలైనా మా వంటిని వదిలి పొయ్యేవి గావు'' అని తన గత చరిత్రనంతా జానకి బామ్మ పూసగుచ్చినట్లు చెబుతుంటే నాకు ఏదో పాత సినిమా చూస్తున్న అనుభూతి కలిగింది.

మధ్యలో, నా పాత్రా ఉందంటూ తాతగారు రంగప్రవేశం చేసి ''ఇక మీ పుట్టింటివాళ్ళ సంగతే చెప్పావూ..పండక్కి ఇంటికొచ్చిన అల్లుళ్ళకు సైతం సాలెవాళ్ళతో నేయించిన ముతక పంచెలే పెట్టేవాడు మీ నాన్న. ఓ గ్లాస్కో పంచె, ఓ పట్టు పంచె ఎరుగుదునా ఏనాడైనా'' అంటూ దెప్పటం మొదలుపెట్టాడు.

''మా పుట్టింట్లో అనే కాదు- ఆ రోజుల్లో పద్ధతులే అలా ఉండేవి. ఎవరింట్లో చూసినా ఇదే పద్ధతి'' అంది బామ్మ తాతయ్యను మళ్ళీ నోరెత్తనివ్వకుండా. దాంతో ఆయన- మనవరాలికోసం తీసుకొన్న ఆరు చీరల్లో ఒకటి జానకి వంటి మీదకు పోగా మిగిలిన ఐదింటిని ముందేసుకుని కూర్చుని ''ఈ చీర రంగు బాగుంది కదూ...ఈ చీర మీద వర్క్ బాగుంది'' అంటూ మళ్ళీ పెళ్ళాం వైపు తిరిగి ''ఇంత నైస్‌గా నువ్వు వర్క్ చేయగలవోయ్. అసలే ముసలమ్మవి. మోటుగా వుందంటే కుట్టుపని, మనవరాలు తీసి అవతల పారేస్తుంది ఆ చీర'' అంటూ బోసి నవ్వులు నవ్వాడు.



''మా బామ్మ వర్క్ చేసి పెడతానంటే కొన్ని ప్లెయిన్ చీరలు, దారాలు, చెమ్కీలు తెచ్చానండీ! బాగానే కుడుతోంది కదా''

అని చీరను అటూ ఇటూ తిప్పి చూసి ''నీకు ఈ వర్క్ వచ్చు అని చెప్పలేదేమే బామ్మా?'' అంది జానకి.

## ప్రియమణి అందాలు!

**ఇటీవల రిలీజ్ అయిన 'యమదొంగ' విజయం ప్రియమణి కెరీర్‌కి మంచి ఊపునిచ్చింది. అయితే ఎక్కువగా ఈ సినిమాలోని నటనా పాత్రలే వస్తున్నాయిట. నటిగా మంచి పేరే వస్తుంది కానీ, మరీ జనాలకి విసుగు కలిగి తన కెరీర్ డల్ అయ్యే అవకాశం వుందనేది ప్రియమణి ఆలోచనట. అందుకనే కాస్త మాంచి గ్లామరస్ పాత్రలయితేనే నటించడానికి ఇష్ట పడతానంటోందిట. అందచందాలు ఆరేయడంలో పెద్ద మొహమాటాలు పడనుకానీ కొంచెం లిమిటెడ్‌గానే అవసరమైనంత మేరకు గ్లామర్ ప్రదర్శనకు సిద్ధం అంటోంది ప్రియమణి. రాబోయే 'భయ్యా'లో ప్రియమణి అందాలు చూసి జనాలు విస్తుబోవాల్సిందేనట!**

''ఇప్పుడు ఈ పేసను నడుస్తోందని నాకేం తెల్సూ..నేనేమైనా ఇల్లుదాటి బయటికెళ్ళేదాన్నా..ఏమన్నానా? నిన్న పెళ్ళికి వెళ్ళబట్టే తెలిసింది'' అంది బామ్మ సమాధానంగా.

అంతటితో ఊరుకోకుండా ''అమ్మాయ్..కొత్తచీర కట్టుకున్నానన్నావ్ కదా ఎంచక్కా...మీ ఆయనతో కల్సి అలా బయటికి వెళ్ళిరారాదూ...నలుగురూ చూస్తారు నీ చీరను'' అని మా ఆవిడకి ఉచిత సలహా కూడా ఇచ్చింది.

అంతే రెచ్చిపోయింది జానకి.

''పదండి వెళ్దాం. మీ ఫ్రెండు రవీ వాళ్ళ ఇంటికీ మా కజిన్ పద్మ వాళ్ళ ఇంటికీ వెళ్దాం'' అంటూ చెప్పుల్లో కాళ్ళు కూడా పెట్టేసింది.

నేను మనసులోనే 'ఇప్పుడు ఆ చీరను వాళ్ళందరి ముందూ ప్రదర్శించి, 'ఆహా! ఓహో! అనిపించుకోవాలి కాబోలు' అనుకుంటూ బద్ధకంగానే లేచి స్కూటర్ కీ తీసుకున్నాను.

★ ★ ★

ఇంటికొచ్చేసరికి రాత్రి పదిగంటల

యింది.

బంధువుల ఇంట్లోనే డిన్నర్ ముగించుకుని వచ్చాం. ముందుగానే జానకి బామ్మ తాతయ్యకు చెప్పటం వల్ల వాళ్ళు కూడా భోజనం చేసి పడుకుని ఉంటారని అనుకుని డిస్టర్బ్ చేయడం ఇష్టం లేక మేమే తాళం తీసుకుని లోపలికి వెళ్ళాం. వాళ్ళను లోపల గడియపెట్టవద్దని చెప్పి బయట నుంచి లాక్ చేసుకుని వెళ్ళటం మాకు అప్పుడప్పుడూ అలవాటే.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

బామ్మ, తాతయ్యల రూమ్‌లో లైటు వెలుగుతుండటం...తలుపు ఓరగా సగం వేసి వుండటం చూసి 'ఇంకా పడుకున్నట్టు లేదు' అనుకుంటూ దాని ముందు నుండి టాయిలెట్ వైపు వెళ్ళబోయాను.

లోపలినుంచి అనుకోకుండా ఏవో మాటలు వినిపించడం మొదలుపెట్టాయి.

''ఎలా ఉన్నానండీ'' అది బామ్మగొంతు.

''చాలా బాగున్నావే..అరవై ఏడేళ్ళ బామ్మలా లేవు..ముప్ఫయి ఐదేళ్ళ ప్రౌఢలా ఉన్నావు'' అంది తాతయ్యగొంతు.

ఠక్కున ఆగిపోయాయి నా కాళ్ళు.

'తప్పు..తప్పు' అనుకుంటూనే నా కళ్ళు తలుపు సందులో నుంచి చూసాయి.

అలమారాకు అమర్చిన నిలువుటద్దం ముందు నిల్చుంది బామ్మ. ఆమె వంటి మీద జానకి కోసమని కొనుక్కొచ్చిన డార్క్‌పింక్ కలర్ చెమ్కీవర్క్ శారీ! ధగధగా మెరిసిపోతోంది బామ్మ.

ఆశ్చర్యంతో నేను నోరెళ్ళబెట్టి అలాగే చూస్తుండిపోయాను.

''వాళ్ళు వస్తారేమో...చూస్తే బాగుండదు ఇక విప్పేయనా?'' అంది బామ్మ తాతయ్యతో.

''వస్తే..తలుపు చప్పుడవుతుందిగా..అప్పుడు విప్పేయవచ్చులే..అయినా మన గదిలోకి ఎందుకొస్తారు...నువ్వు ఈ చీరను ఇప్పుడు కట్టుకున్నావు గానీ..నేను మొన్న ఆ పెళ్ళిలో ఫ్యాన్సీ చీరలు కట్టుకుని హడావుడీగా అటూ ఇటూ తిరుగుతున్న ఆ పడుచుపిల్లల్లో నిన్ను ఎప్పుడో ఊహించుకున్నాలే'' అన్నారు తాతగారు.

నేను ఇక అక్కడి నుంచి వెనక్కి మా రూమ్‌కి వెళ్ళి జానకిని వెంటబెట్టుకుని వచ్చాను. ఆ దృశ్యం చూపిస్తే 'హవ్వ!' అని బుగ్గలు నొక్కుకుంది. ''నా కళ్ళను నేను నమ్మలేకపోతున్నాను. బామ్మ ఏంటీ ఈ వయసులో ఇలా'' అంటూ బోలెడు ఆశ్చర్యపోయింది.

''ఆశ్చర్యపోయింది చాలులే గానీ..ఇక రా..మనం చూస్తున్నామని వాళ్ళకు తెలిస్తే సిగ్గుపడతారు. వాళ్ళ ఆనందానికి అంతరాయం కలుగుతుంది'' అని గుసగుసగా ఆమె చెవిలో చెప్పగానే ఆమె చటుక్కున తలతిప్పి నా వంక నమ్మలేనట్లుగా చూసింది. నేను ముందు తన చెయ్యి పట్టుకుని మా బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళాను. ఆ వృద్ధదంపతులకు మా మాటలు వినపడనంత దూరం వెళ్ళాక అప్పుడు నేను ఏదో అనబోయేంతలో జానకి ముందుగా తన గొంతు విప్పింది అసహనం ఆపుకోలేక.


''ఛ..ఛ! బామ్మ మీద ఉన్న ఇంప్రెషన్ అంతా పోయింది ఈరోజుతో నాకు! ఆమె పెద్దరికం ఓ నాటకం అన్నమాట! ఈ వయసులో ఆమెకు ఇలాంటి సరదాలేంటి? ఆ చీర..అలా ఎలా కట్టుకుంది? పైగా అద్దంలో చూసుకుని మురిసిపోవడం కూడా! ఈ రోజుతో తాతయ్య మీది ఇంప్రెషన్ కూడా పోయింది నాకు. ఆమెకు చెప్పాల్సింది పోయి..కొత్త పెళ్ళి కొడుకులా మంచం మీద కూర్చుని బామ్మను మరింత ప్రోత్సహిస్తున్నాడు'' అంది.

ఆ మాటల్లోని అపరిపక్వతను, అలవాటయిన ఆలోచనాధోరణిని గుర్తించగానే నా పెదవులపై అప్రయత్నంగా ఓ చిరునవ్వు వెలిసింది.

''నవ్వుతారేంటి...నాకు వళ్ళు మండుతుంటే?'' అంది జానకి కోపంగా.

''జానకీ! మీ బామ్మ చర్య నీకు కోపం తెప్పిస్తోందేమోగానీ నాకు మాత్రం 'పాపం బామ్మ' అనిపిస్తోంది. వెనకటి కాలంలో ఇన్ని ఫ్యాషన్లు, ఇంతటి అలంకరణ ప్రియత్వం ఉండేవి గావు. పైగా ఆడపిల్ల ఇలా ఉండాలి అలా ఉండాలన్న ఆంక్షలతోపాటు ఈ వయసులో 'ఇలాగే' ఉండాలన్న నిబంధనలు కూడా ఉండేవి. అందువల్ల అమ్మాయిల అలంకరణకు పరిమితులు ఏర్పడ్డాయి. చిన్నప్పుడే పెళ్ళిళ్ళు, అధిక సంతానం, బాధ్యతల బరువులు ఇవి కూడా ఆడపిల్లలను అకాల వృద్ధాప్యానికి గురిచేసి తమను గురించి తాము పట్టించుకునే సమయాన్ని, ఆసక్తిని లేకుండా చేసేవి. వయసు వచ్చినప్పటి నుంచీ నేత చీరలకు, ముతక చీరలకు ఆ తరువాత మారిన కాలంతోపాటు కాస్త మారి జరీ చీరలకు అంకితమైపోయిన మీ బామ్మను..ఈ కాలం ఆడపిల్లలు కట్టుకుంటున్న చెమ్కీవర్క్ చీరలు ఆకర్షించడం అత్యంత సహజమైన విషయం. ఆమెదీ ఆడమనసే..కాకుంటే కాలపరిస్థితులననుసరించి ఆమె కోర్కె కొన్ని దశాబ్దాలు లేట్ అయింది. అందుకనే అది అవ్యక్తమయి ఆమె మనసులోనే గుప్తంగా ఉండిపోయింది. ఈ వయసులో చెమ్కీవర్క్ చీర కట్టుకుని పదిమందిలోకి పోలేదు కదా..అలా అని ఆ కోర్కెనూ పూర్తిగా చంపుకోలేకపోతోంది. అందుకనే ఇంట్లో..తన గదిలో నాలుగు గోడల మధ్య కేవలం తన భర్త సమక్షంలో తాత్కాలికంగా తన చిన్న కోర్కెను తీర్చుకుంది. ఆ వర్క్ చీర కట్టుకోవాలన్న కోర్కె మీ బామ్మదయితే అలాంటి చీరలో భార్యను చూసుకోవాలన్న కోర్కె మీ తాతయ్యది. అందుకే 'పాపం!' అన్నాను. సమాజ భయంతోనే కదా ఆవిడ అంత రహస్యంగా..చూపరులెవ్వరూ లేని చోట...కేవలం తన భర్తను మాత్రం చూపరిగా, తనను ప్రశంసించేవాడిగా పెట్టుకుంది'' అని నేను అనగానే మా ఆవిడ కళ్ళల్లో బాధ సుళ్ళు తిరిగింది. ముఖంలో బామ్మమీద బోలెడు సానుభూతి కనిపించింది.

ఒక్క నిముషం ఏదో సీరియస్‌గా ఆలోచించి ''ఏదో ఒక ప్లాన్ వేసి బామ్మతో రేపు నేను చెమ్కీవర్క్ శారీ కట్టిస్తాను. అప్పుడు తాతయ్య ఒక్కడే కాదు..మనం ఇద్దరం కూడా ప్రేక్షకులమయి ప్రశంసలతో ఆవిడను ముంచెత్తుదాం. చప్పట్లు కొడదాం. ఫోటోలు, తీద్దాం. వీడియో తీద్దాం. ఆ విధంగా ఆమె కోర్కెను ఘనంగా తీరుద్దాం'' అంది జానకి పట్టలేని ఆనందంతో.




చిన్నపిల్లలా తను సరదా పడుతుంటే చూడటానికి నాకూ ముచ్చటేసింది.

'సరదాలు, కోర్కెలు పిల్లలకు, పడుచులకే కాదు-వయసు మీరిన వాళ్ళకూ ఉంటాయి. ఈ విషయాన్ని పిన్నలు అర్థం చేసుకుని, వాళ్ళ సరదాలు తీర్చే ప్రయత్నాలు చేసినా చేయకపోయినా కనీసం విమర్శించకుండా వుంటే..వాళ్ళను తమ నుండి వేరు చేయకుండా వుంటే కుటుంబంలో, సమాజంలో ఒక సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుంది. పరస్పర అవగాహనలకు చోటు కల్పించి నట్లవుతుంది' అన్న నా అభిప్రాయాన్ని నా భార్య జానకి అంత త్వరగా అర్థం చేసుకోవటమేగాక ఆచరణకూ పూనుకోవడం నాకు చాలా ఆనందాన్ని కలిగించింది.

☆